నగరంలో ఓనం సందడి



ఎస్‌కేపీసీలో సంప్రదాయ వస్త్రధారణలతో పూల రంగవల్లికలతో సందడి చేస్తున్న విద్యార్థినులు

● మలయాళీలకు నేతల శుభాకాంక్షలు

ప్యారీస్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలో జరుపుకొనే సంప్రదాయ పండగలో అతి పెద్ద పండుగ అయిన ఓనంను శుక్రవారం వామన జయంతిగా జరుపుకునేందుకు రాష్ట్రంలో స్థిరపడిన మలయాళీలు ఏర్పాట్లు చేసుకున్నారు. ఓనంను ఆహ్వానిస్తూ ముందురోజైన గురువారమే నగరంలో ఉన్న పలు విద్యాసంస్థలు, మలయాళీ సంఘాలు వేడుకలను వైభవంగా జరుపుకున్నాయి. కేరళ ఆచారాలు, సంప్రదాయాలతో ముడిపడిన ఓనంను ఆహ్వానిస్తూ జార్జిటౌన్‌లోని శ్రీకన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల ప్రాంగణంలో విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలతో కళకళలాడింది. కేరళ సంప్రదాయ వస్త్రధారణలతో, రకరకాల పూలతో వేదిక ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్ది విద్యార్థినులు సందడి చేశారు.

ఓనం పండుగను పురస్కరించుకుని పలువురు రాజకీయ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, మరో మాజీ సీఎం ఓ పన్నీర్‌సెల్వం, పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, తమిళ మానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే వాసన్, పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి, ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్‌లు గురువారం వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనలో మలయాళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కోతల పండుగ అయిన ఓనంను ఉత్సాహంగా జరుపుకుంటున్న మలయాళీలందరికీ సీఎం స్టాలిన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రంగవల్లికలు, నూతన వస్త్రాలు, నృత్య ప్రదర్శనలు, ఆటల పోటీలతో సమైక్యత చాటుతున్న కేరళ ప్రజలకు రాష్ట్రప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం తన ప్రకటనలో తెలిపారు. అదే విధంగా 'అత్తం పత్తు ఓనం' పేరుతో పది రోజుల పాటు ఈ పండుగను మలయాళ ప్రజలు ఎంతో సంతోషంగా జరుపుకోవాలని ఈపీఎస్ కోరారు. అదేవిధంగా ఇతర రాజకీయ పార్టీల నేతలు ప్రజలకు ఓనం పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

విద్య, విద్యుత్, ఐటీ రంగాల్లో
అగ్రస్థానం

● రాష్ట్రంలోని అవకాశాలపై ప్రజెంటేషన్
● ఇంగ్లండ్ మంత్రితో స్టాలిన్ భేటీ
● సీఎం విదేశీ పర్యటనపై ప్రభుత్వ ప్రకటన



రోల్స్ రాయిస్ ప్రతినిధితో సీఎం

చెన్నై, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం కోసం విదేశీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్.. తన పర్యటనలో భాగంగా గురువారం ఇంగ్లండ్ మంత్రి కేథ్రిన్ వెస్ట్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలోని మౌలిక సదుపాయాలను వివరించారు. ముఖ్యంగా, విద్య, ఐటీ, ఇంధన శక్తి రంగాల్లో తమ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని గుర్తు చేశారు. తమ రాష్ట్రంలో అన్ని రకాలైన అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, పెట్టుబడులు పెట్టాలని ఆయన కోరారు. అంతేకాకుండా, వాతావరణ మార్పులు, ఎదురయ్యే సవాళ్ళపై కలిసికట్టుగా, ఉమ్మడి సహకారంతో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. సీఎం స్టాలిన్ విదేశీ పర్యటనలో భాగంగా రైజింగ్ ఐరోపియా టూర్ రెండో దశలో లండన్ నగరంలో ఉన్న విదేశీ, కామన్వెల్త్, అభివృద్ధి కార్యాలయంలో ఇంగ్లండ్ మంత్రి, పార్లమెంట్ ఉప నేత (ఇండో పసిఫిక్) కేథ్రిన్ వెస్ట్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అనేక శాఖల్లో ఉన్న అవకాశాలను ఆయన వివరించారు. ప్రధానంగా ఇండో పసిఫిక్ రీజియన్‌లో ఆర్థికాభివృద్ధిపరంగానే కాకుండా, విద్య, పరిశోధన, సముద్ర రవాణా అనుసంధానం తదితర అంశాల్లో రాష్ట్ర పనితీరు వివరించారు. వాణిజ్యం, పెట్టుబడుల రంగంలో ఇంగ్లండ్ భాగస్వామ్యాన్ని ఆయన కోరారు. ఈ భేటీ సీఎం స్టాలిన్ ఇంగ్లండ్ పర్యటనను మరింత బలం చేకూర్చుతుందని ప్రభుత్వం పేర్కొంది. అంతేకాకుండా, ఈ పర్యటనలో అనేక ఒప్పందాలను కుదుర్చుకున్నారు. ఈ భేటీలో రాష్ట్ర మంత్రి టీఆర్‌బీ రాజాతో పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం స్టాలిన్ జర్మనీ పర్యటన తర్వాత ఇంగ్లంగ్‌లో అడుగుపెట్టిసరాష్ట్రంలోని అన్ని అవకాశాలను వివరిస్తూ పెట్టుబడులను ఆకర్షించేలా పారిశ్రామికవేత్తలను కలుస్తున్నారు. ఇందులోభాగంగా, ఇప్పటికే రోల్స్ రాయిస్ సంస్థతో కలిసి హోసూర్‌లో విమాన విడి భాగాల పరిశ్రమతో పాటు పలు రక్షణ ఒప్పందాలను కుదుర్చుకున్నారు. విల్సాన్ పవర్‌తో రూ.300 కోట్లకు ఒప్పందం కుదుర్చుకున్నారు.

కొత్త డీజీపీ ఎంపిక కోసం 9 మందితో జాబితా

అడయార్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కొత్త డీజీపీ ఎంపిక ప్రక్రియలో భాగంగా తొమ్మిది సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లతో కూడిన జాబితాను ఢిల్లీలోని కేంద్ర కార్యాలయానికి పంపించారు. ఈ జాబితాలో సీనియర్ ఐపీఎస్ అధికారులైన సీమా అగర్వాల్, రాజీవ్ కుమార్, సందీప్ రాయ్ రాథోడ్, అభయ్ కుమార్ సింగ్, వన్నియ పెరుమాళ్, మహేష్ కుమార్ అగర్వాల్, వెంకట్ రామన్, వినిత్ దేవ్ వాంఖడే, సంజయ్ మాతూర్ పేర్లు న్నాయి. కాగా, ప్రస్తుత డీజీపీ శంకర్ జీవాల్ గత నెల 31వ తేదీలో పదవీ విరమణ పొందిన విషయం తెల్సిందే. దీంతో తాత్కాలిక డీజీపీగా జి.వెంకట్‌రామన్‌ను ప్రభుత్వం నియమించింది. అయితే, సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు కొత్త డీజీపీ నియామకం కోసం సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లను ప్రభుత్వం ఢిల్లీకి పంపించింది. వీరిలో ఒకరిని సెలక్షన్ కమిటీ కొత్త డీజీపీగా ఎంపిక చేయనుంది.



ఉత్తమ జాతీయ విద్యా సంస్థల్లో
ఐఐటీదే అగ్రస్థానం

పెరంబూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా సంస్థల జాబితాలో మద్రాసు ఐఐటీ వరుసగా ఏడో సంవత్సరం కూడా అగ్రస్థానంలో నిలిచింది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ప్రతి ఏడాది ఉత్తమ విద్యా సంస్థల జాబితా విడుదల చేస్తోంది. ఆ ప్రకారం, 2025వ సంవత్సరానికి ఉత్తమ విద్యాసంస్థల్లో దేశవ్యాప్తంగా 8,686 సంస్థలున్నాయి. జాబితాలో అత్యధికంగా దక్షిణాది ప్రాంతాల నుంచే 3,344 విద్యా సంస్థలున్నాయి. ఈ ఏడాది జాబితాలో చెన్నై ఐఐటీ మళ్లీ మొదటి స్థానంలో నిలిచింది. ఆ ప్రకారం, జాతీయ ఉత్తమ విద్యా సంస్థల్లో ఏడో ఏడాదిగా మద్రాసు ఐఐటీ అగ్రస్థానంలో నిలిచింది. బెంగళూరు ఐఐఎస్, ముంబై ఐఐటీ తదుపరి స్థానాల్లో నిలిచాయి. కాగా, జాబితాలోని 10 స్థానాల్లో 6 ఐఐటీలు ఉండడం గమనార్హం.

రాష్ట్రంలో పెరుగుతున్న
జ్వరాలు

● అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరిక
● నగరంలోనే అధిక కేసులు



అడయార్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత రెండు వారాలుగా జ్వరపీడితుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. ముఖ్యంగా రాజధాని నగరం చెన్నైతో పాటు కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్ళూరు జిల్లాల్లో జ్వర పీడితులు అధికంగా ఉన్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా మూడు రకాలైన వైరస్‌లు వ్యాపించి, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు జ్వరం బారిన పడుతున్నట్టు సమాచారం. ఈ మూడు రకాలైన వైరస్‌ల్లో 'ఇన్‌ఫ్లుయెంజా-ఏ' రకం ప్రభావం ఎక్కువగా ఉంది. ఈ వైరస్ కారణంగా వచ్చే జ్వరం మూడు రోజుల్లోనే నయమవుతుందని వైద్యులు అంటున్నారు. అదేసమయంలో రద్దీ ప్రదేశాల్లో ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపించవచ్చని, అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు. ఇదేవిషయంపై ప్రజా ఆరోగ్య శాఖ సంచాలకులు సోమసుందరం మాట్లాడుతూ, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వాతావరణంలో మార్పులు జరగడం, వర్షాల కారణంగా వైరస్ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా తుమ్ములు, జ్వరం, తలనొప్పి, జలుబు, వళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయని, ఇలాంటి లక్షణాలతో బాధపడేవారు సొంత వైద్యం కాకుండా, ప్రభుత్వ లేదా ప్రైవేటు వైద్యులను సంప్రదించి వారు చెప్పినట్టుగా ఆ మందులను వాడాలని ఆయన కోరారు.

ఆందోళన వద్దు

● మంత్రి ఎం.సుబ్రమణ్యం

పెరంబూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యాప్తిస్తున్న వైరల్ జ్వరాలు వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులని, వీటిపై ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. నగరంలో గురవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో కొత్త వ్యాధుల వ్యాప్తి లేదన్నారు. అపరిశుభ్రమైన నీటి ద్వారా కేరళలో మెదడుపై ప్రభావం చూపే అమీబా ఇన్ఫెక్షన్ వ్యాపిస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు అమీబా వ్యాప్తి లేదన్నారు. మాస్క్ తప్పనిసరంటూ వదంతులు వ్యాపిస్తున్నాయని, ప్రజల స్వీయరక్షణ కోసం మాస్క్ ధరించవచ్చని మంత్రి తెలిపారు. జీఎస్‌టీ తగ్గింపుపై అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిస్తూ... జీఎస్టీ పన్ను పెంచింది బీజేపీ ప్రభుత్వమేనని, ప్రస్తుతం తగ్గించింది ఆ ప్రభుత్వమేనని మంత్రి పేర్కొన్నారు.

కోవైలో టీ రూ.20... కాఫీ రూ.26

పెరంబూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల నగరం కోయంబత్తూర్‌లో టీ, కాఫీ ధరలు పెరిగాయి. టీ, కాఫీ తయారీకి వినియోగించే ముడిసరుకుల ధరలు పెరిగాయని, అందువల్ల టీ, కాఫీ ధరలు పెంచుతున్నట్లు తమిళనాడు టీ దుకాణాల యజమానుల సంఘం ఇటీవల ప్రకటించింది. ఆ ప్రకారం, నగరంలో కొన్ని చోట్ల రూ.12గా ఉన్న టీ ధర రూ.15, రూ.15గా ఉన్న కాఫీ ధర రూ.20కి పెంచారు. తాజాగా, చెన్నైతో పాటు కోయంబత్తూర్‌లో కూడా కాఫీ, టీ ధరలు పెరిగాయి. ఆ ప్రకారం టీ రూ.20, కాఫీ రూ.26, బ్లాక్ టీ రూ.17కు పెంచారు.





రోడ్‌షోలో మాట్లాడుతున్న ఈపీఎస్

స్టాలిన్ కల ఫలించదు

● కూటమి ద్వారా అధికారం కల్ల ● ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెద్ద కూటమిని అడ్డం పెట్టుకుని, దాని ద్వారా మళ్లీ అధికారం పొందాలనే సీఎం స్టాలిన్ కల ఫలించదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీట్పోం' అనే నినాదంతో జూలై 7వ తేదీన కోవై జిల్లా మేట్టుపాళయంలో ప్రారంభించిన ఈపీఎస్ ప్రచారయాత్ర గురువారం మదురై ఈస్ట్ నియోజకవర్గంలోని పలంగానత్తం, సెంట్రల్ నియోజకవర్గం మేళమాసివీధి ప్రాంతాల్లో జరిగింది. ఈ రోడ్‌షోలో ఈపీఎస్ మాట్లాడుతూ మదురై పశ్చిమ నియోజకవర్గం అన్నాడీఎంకేకు కంచుకోట అని, ఇక్కడి ప్రజలను మభ్యపెట్టి ఎలాగైనా గెలుపొందాలని డీఎంకే చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయన్నారు. నాలుగేళ్లకు పైగా అధికారంలో కొనసాగుతున్న డీఎంకే ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపించారు. టాస్మాక్‌లో అవినీతిపై దర్యాప్తు చేపట్టిన ఈడీ అధికారులు త్వరలోనే పలువురిని అరెస్టు చేసే అవకాశముందన్నారు. సీఎం స్టాలిన్ పెట్టుబడులు సమీకరించేందుకు విదేశాలకు వెళ్లలేదని, తాము దోచుకున్న నగదు పెట్టుబడిగా పెట్టేందుకే వెళ్లారని ఈపీఎస్ ఆరోపించారు. విల్లుపురం జిల్లా దిండివనం మున్సిపాలిటీలో పనిచేస్తున్న దళిత వర్గానికి చెందిన ఓ అధికారిని గురువారం కమిషనర్ కార్యాలయానికి రప్పించి ఓ మహిళా కౌన్సిలర్ కాళ్లు పట్టుకునేలా చేయడం సామాజిక న్యాయమా? అని ఈపీఎస్ ప్రశ్నించారు. మదురై పార్లమెంట్ సభ్యుడు సీపీఐకు చెందిన ఎంపీ వెంకటేశన్ కూడా మదురై కార్పొరేషన్‌లో జరిగిన రూ.2కోట్ల అవినీతికి వ్యతిరేకంగా పోరాడేందుకు ముందుకు రాలేదని, ఈ నేతల పనితీరును ప్రజలు గుర్తుంచుకుంటారన్నారు. అధికార డీఎంకే నేతలకు దివంగత మాజీముఖ్యమంత్రి కరుణానిధి కుటుంబం మాత్రమే చిరునామా అని, డీఎంకే కుటుంబ పాలనకు స్వస్తిపలికేందుకు రాష్ట్రప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

సునామీ విపత్తులపై
అవగాహన మాక్ డ్రిల్



సముద్రంలో చిక్కుకున్న వారిని రక్షిస్తున్న దృశ్యం

చెన్నై, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సునామీ విపత్తులపై అవగాహన మాక్ డ్రిల్ గురువారం జరిగింది. కడలూరు జిల్లా సోత్తికుప్పం, పరంగిపేట తదితర జాలర్ల గ్రామాల్లో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. సునామీ హెచ్చరిక వెలువడిన వెంటనే ప్రజల సురక్షిత ప్రాంతాలకు ఎలా వెళ్లాలి? బాధిత ప్రజలను ఎలా రక్షించాలి? ప్రాథమిక చికిత్స ఎలా చేయాలి? విద్యుత్ కనెక్షన్లు ఎలా తొలగించాలి? తదితరాలను అగ్నిమాపక, పోలీసు సిబ్బంది ప్రత్యక్షంగా చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.

సేలం కలెక్టరేట్ వద్ద
కుటుంబం ఆత్మహత్యాయత్నం

ప్యారీస్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సేలం కలెక్టరేట్ వద్ద ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలంరేపింది. సేలం జిల్లా ఎడప్పాడి సమీపంలోని ఆడయూరు గ్రామానికి చెందిన కుమార్ (45), ఆయన భార్య శాంతి (41), తండ్రి మాణిక్యం (70), తల్లి శ్రీరంగాయి (65) కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకునేందుకు ప్రయత్నిస్తుండగా, అక్కడున్న పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాధితుడు కుమార్ మాట్లాడుతూ.. ఆడయూర్ గ్రామంలో తమ భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, తమ భూమికి సమీపంలో ఉన్న 1.40 ఎకరాల ప్రభుత్వ భూములను అదే ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులు ఆక్రమించుకుని తాము ఆ మార్గంలో వెళ్లరాదని, వ్యవసాయం చేయరాదని బెదిరిస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. అంతేకాకుండా తమపై పలుమార్లు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. దానిపై స్థానిక పోలీసులకు, కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవని, అందువల్లే తాము ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డామని వాపోయారు. ఈ ఘటనపై సేలం టౌన్ పోలీసులు విచారణ చేపట్టారు.



ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న వారిని అడ్డుకుంటున్న పోలీసులు

ఎన్డీయే కూటమికి దినకరన్ రాంరాం



ప్యారీస్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి నుంచి వైదొలిగినట్లు అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ తెలిపారు. ఎన్డీయే కూటమిలో తమ పార్టీకి తగిన గౌరవం లేనందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు దినకరన్ గురువారం కాట్టుమన్నార్‌కోవిల్‌లో జరిగిన ఓ వివాహ వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా వివరించారు. 2024లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని కావాలనే లక్ష్యంతో తాము ఎన్డీయే కూటమిలో చేరామని, కూటమి గెలుపుకోసం రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి విస్తృతంగా ప్రచారం చేశామని, అయినా తమ పార్టీకి కూటమిలో గౌరవంలేదన్నారు. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే, ఆ పార్టీ మిత్రపక్షాలను చిత్తుగా ఓడించడమే లక్ష్యంగా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. దివంగత మాజీముఖ్యమంత్రి జయలలిత పట్ల విశ్వాసం చూపుతున్న వారికి అన్నాడీఎంకేలో స్థానం లేకుండా చేశారని, మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామికి అనుకూలంగా ఎన్డీయే కూటమి నేతలు వ్యవహరించడం తమ లాంటివారు జీర్ణించుకోలేకపోతున్నారని టీటీవీ దినకరన్ పేర్కొన్నారు. ఎన్డీయే కూటమిలో ఏఎంఎంకే భాగస్వామ్యం వహించదని, తాము మరోదారిలో పయనించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరితో పొత్తు అనే విషయాన్ని డిసెంబర్‌లో ప్రకటిస్తానని దినకరన్ తెలిపారు. ఇటీవల ఎన్డీయే కూటమి నుండి మాజీ సీఎం ఓ.పన్నీర్ సెల్వం వైదొలిగిన నేపథ్యంలో టీటీవీ దినకరన్ కూడా ఆ కూటమికి గుడ్‌బై చెప్పడం ఆ కూటమి నేతలను కాస్త ఇబ్బంది పెట్టే అంశమే. కాగా, ఎన్డీయే కూటమి నుండి టీటీవీ దినకరన్ వైదొలగడాన్ని వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ స్వాగతించారు.

సమాచార దృష్టి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చెన్నై, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

తాంబరం: ది కైటేజ్ విల్ ఇంపాక్ట్ సర్వీస్ రోడ్డు, ఇన్ఫికాన్ ఫ్లాట్స్, టీటీకే నగర్, ఎరుసేలం నగర్, చర్చ్ రోడ్డు, రత్నకుమార్ అవెన్యూ, మరుదం ఫ్లాట్స్, ఏఎస్ రాజన్ నగర్, జీకే మూపనార్ అవెన్యూ.

తిరువేర్కాడు: రాణి అన్నా నగర్, అశోక్ మిడోస్, వల్లి ఆలయమేడు, పెరుమంగళం ఇండస్ట్రియల్ ఎస్టేట్, బీఎంఆర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, కామరాజ పురం, కేఎస్ఆర్ నగర్, వీజేఎన్ శాంతి నగర్, కాస్మో పాలిస్, బ్రైంట్ పార్క్, విక్టోరియా పార్క్, ఫైవ్ ఫేస్-1,2.

గ్రామ సహాయకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఖాళీగా ఉన్న గ్రామ సహాయకుల పోస్టులకు అక్టోబరు 1వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ విడుదల చేసిన ప్రకటనలో... చెన్నై జిల్లా రెవెన్యూ విభాగం పరిధిలో 20 గ్రామ సహాయకుల పోస్టులను ఎంప్లాయ్‌మెట్ ఎక్ఛేంజ్ ద్వారా ప్రత్యక్షంగా భర్తీ చేయనున్నామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు అక్టోబరు 1వ తేది సాయంత్రం 5.45 గంటల్లోపు chennai.nic.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని, పోస్టులు, ఇతర వివరాలకు అదే వెబ్‌సైట్ సంప్రదించాలని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

మూడు రోజులు చిత్ర కళా ప్రదర్శన

పెరంబూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్‌లోని ప్రభుత్వ మ్యూజియంలో ఈ నెలలో మూడు రోజులు చిత్రకళా ప్రదర్శన ఏర్పాటుకానుంది. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో.... ఈ చిత్ర ప్రదర్శనలో చిత్రకారులు, శిల్ప కళాకారులు తమ తమ చిత్రాలు ప్రదర్శించవచ్చు. ఆసక్తి కలిగిన వారు కళలు, సాంస్కృతిక విభాగం www.artandculture.tn.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 15వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

సహకార బ్యాంక్ ఉద్యోగాలకు లక్ష దరఖాస్తులు

పెరంబూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంక్, ప్రధాన సహకార సంఘాల్లో ఖాళీగా ఉన్న 2,000 అసిస్టెంట్ పోస్టులకు లక్ష మంది దరఖాస్తు చేశారు.. ఈ పోస్టుల భర్తీకి గత నెల 6వ తేది నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ పోస్టులకు రాత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు ప్రకటించారు. దరఖాస్తు స్వీకరణ 29వ తేదీతో ముగిసిన నేపథ్యంలో లక్ష మంది దరఖాస్తులు సమర్పించారని అధికారులు తెలిపారు.

నేడు మద్యం దుకాణాలకు సెలవు

పెరంబూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మిలాదున్ నబి పండుగ సందర్భంగా శుక్రవారం చెన్నై జిల్లాలోని టాస్మాక్ మద్యం దుకాణాలకు సెలవు ప్రకటించారు. నిబంధనలు అతిక్రమించి మద్యం విక్రయాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు చేపడతామని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ ప్రకటన విడుదల చేశారు.

గిరి ప్రదక్షిణకు అనుకూల సమయం

చెన్నై, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయంలో జరిగే పౌర్ణమి గిరి ప్రదక్షిణ అనుకూల సమయాన్ని ఆలయ అధికారులు ప్రకటించారు. ఆ ప్రకారం, ఈ నెల 6వ తేది ఉదయం 11.41 గంటల నుంచి మరుసటిరోజు ఉదయం 11.38 గంటల వరకు గిరి ప్రదక్షిణకు అనుకూల సమయమని, గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

7న తిరువణ్ణామలైకి ప్రత్యేక రైలు...

తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక అన్ రిజర్వ్‌డ్ రైలు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, విల్లుపురం నుంచి ఈ నెల 7వ తేది (ఆదివారం) ఉదయం 10.10 గంటలకు బయల్దేరే రైలు 11.45 గంటలకు తిరువణ్ణామలై చేరుకుంటుంది. మరుమార్గంలో, తిరువణ్ణామలై నుంచి అదే రోజు మధ్యాహ్నం 12.40 గంటలకు బయల్దేరి 2.15 గంటలకు విల్లుపురం చేరుకుంటుందని దక్షిణ రైల్వే తెలిపింది.

17 నుంచి అర్ధ వార్షిక పరీక్షలు

● టైం టేబుల్ విడుదల

అడయార్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి 5వ తేదీ వరకు చదివే విద్యార్థులకు అర్ధ వార్షిక పరీక్షలు ఈ నెల 17 నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ టైం టేబుల్ వెల్లడించింది. ఆరు నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఇప్పటికే ఈ తరహా పరీక్షలను నిర్వహించేందుకు కాల నిర్ణయ పట్టిక విడుదల చేయగా, తాజాగా 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు టైం టేబుల్ విడుదలచేసింది.. ఈ టైం టేబుల్ ప్రకారం 4, 5వ తరగతి విద్యార్థులకు 17వ తేదీ నుంచి 25వ తేదీ వరకు, 1 నుంచి 3వ తరగతి విద్యార్థులకు 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొంది.

పూందమల్లి-సుంగువాసత్రం మెట్రో ప్రాజెక్ట్‌కు రూ.2,126 కోట్లు

పెరంబూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పూందమల్లి నుంచి సుంగువా సత్రం వరకు మెట్రో రైలు ప్రాజెక్ట్‌కు తొలివిడతగా రాష్ట్ర ప్రభుత్వం రూ.2,126 కోట్లు కేటాయించింది. పూందమల్లి-పరందూర్ విమానాశ్రయం వరకు మెట్రో రైలు ప్రాజెక్ట్‌కు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చిన నేపథ్యంలో, తొలివిడతగా సుంగువాసత్రం వరకు మెట్రో పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించింది. పూందమల్లి నుంచి తిరుమళిసై, శ్రీ పెరుంబుదూర్ మీదుగా పరందూర్ విమానాశ్రయం వరకు మొత్తం 43.63 కి.మీ మేర 19 ఫ్లై ఓవర్ మెట్రో రైల్వే స్టేషన్లతో రైలు మార్గం ఏర్పాటుకు సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. ఈ ప్రాజెక్ట్ రెండు విడతలుగా చేపట్టాలని సిఫారసు చేసిన నేపథ్యంలో, తొలివిడతగా పూందమల్లి-సుంగువాసత్రం వరకు రూ.8,779 కోట్లతో 27.9 కి.మీ మెట్రో ఫ్లై ఓవర్ నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్ట్‌లో భూసేకరణ, ఇతర పనులకు తొలివిడతగా రూ.2,126 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది.

కులశేఖరపట్టినంలో ఊపందుకున్న పూసల దండల అమ్మకాలు

● 23న దసరా వేడుకల ప్రారంభం



కులశేఖరపట్టినం ఆలయం వద్ద పూసల దండలు విక్రయిస్తున్న సుగాలీలు

చెన్నై, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్టినం ముత్తారమ్మన్ ఆలయంలో ఈ నెల 23న దసరా వేడుకలు ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. దేశంలో మైసూరు తర్వాత దసరా వేడుకలు భారీ స్థాయిలో జరిగే దివ్యక్షేత్రంగా ఆ ఆలయానికి పేరుంది. ఈ వేడుకల సందర్భంగా వ్రతమాచరించేవారు, వేషాలు ధరించేవారు పూసల దండలను ధరిస్తారు. ఆ మేరకు ప్రస్తుతం ఆలయ పరిసరాల్లో పూసల దండల అమ్మకాలు ఊపందుకున్నాయి. ఈ నెల 23 వేకువజామున ధ్వజారోహణంతో ప్రారంభమయ్యే ఈ వేడుకలు అక్టోబర్ 4 వరకు కొనసాగుతాయి. అక్టోబర్ 2న శూరసంహార వేడుకలు జరుగనున్నాయి. ఈ వేడుకల సందర్భంగా వ్రతమాచరించే భక్తులు పూసల దండలను సముద్రంలో శుభ్రంగా కడిగి, వాటిని అమ్మవారి పాదల చెంత ఉంచి ప్రత్యేక పూజల అనంతరం మెడలో ధరిస్తారు. ఈ పూసల దండలను విక్రయించేందుకుగాను ఇప్పటికే తిరునల్వేలి, వళ్ళియూరు, పేట్టై, రామనాథపురం, శివగంగ తదితర ప్రాంతాల నుండి సుగాలీలు పెద్ద సంఖ్యలో కులశేఖరపట్టినం చేరుకున్నారు. ఈ వేడుకల సందర్భంగా భక్తులు 61, 41, 21, 11 రోజులపాటు వ్రతమాచరిస్తారు. వ్రతాన్ని ప్రారంభించే భక్తులు ముందుగా చిదంబరేశ్వరం వద్ద సముద్ర స్నానం చేసి, పూసల దండలను కడిగి, వాటిని స్వామివారి పాదాలపై ఉంచి మెడలో ధరిస్తారు. ప్రస్తుతం ఆలయ పరిసరాల్లో ఈ పూసల దండలను రూ.30ల నుండి రూ.350ల ధరలకు విక్రయిస్తున్నారు.

పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత

● 7న పాఠశాలలకు అభినందన సభ

పెరంబూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గడిచిన విద్యా సంవత్సరంలో పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించిన ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, తమిళంలో 100కు 100 మార్కులు సాధించిన విద్యార్థులను తిరుచ్చిలో ఈ నెల 7వ తేది అభినందన సభ జరుగనుంది. ఆ ప్రకారం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన 2,811 మంది ప్రధానోపాధ్యాయులు, 135 మంది విద్యార్థులను మంత్రి అన్బిల్ మహేష్ అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు. తిరుచ్చి పాపకుర్చి కాట్టూరులోని మాన్‌ఫోర్ట్ పాఠశాలలో ఉదయం 9.30 గంటలకు జరిగే కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు సకాలంలో వచ్చేలా ఏర్పాటుచేపట్టాలని జిల్లా ప్రధాన విద్యాధికారులకు పాఠశాల విద్య డైరెక్టర్ ఎస్.కన్నప్పన్ ఉత్తర్వులు జారీచేశారు.

త్వరలో రాష్ట్ర ఉన్నత విద్యా విధానం విడుదల

● మంత్రి కోవి చెళియన్

పెరంబూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రయోజనాలు కాపాడేలా ఉన్నత విద్యా విధానం ఉంటుందని ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ తెలిపారు. నగరంలో గురువారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... ఉన్నత విద్యకు సంబంధించిన రాష్ట్ర విద్యా విధానం రూపకల్పన జరుగుతోందన్నారు. దేశంలోనే ఉన్నత విద్యలో రాణిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యారంగం ప్రతిష్టతను నిలబెట్టుకోవాలని ముఖ్యమంత్రి సూచించారని తెలిపారు. ఉన్నత విద్యా విధానం విద్యార్థుల ప్రయోజనాలు కాపాడే విధంగా ఉంటుందన్నారు. త్వరలో ఈ విధానం ప్రకటిస్తామన్నారు. ఎప్పుడు ప్రకటిస్తారు అనే విషయం చెప్పలేమని, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో చర్చించి వివరాలు తెలియజేస్తామని మంత్రి చెళియన్ తెలిపారు.

ఉచిత విద్యుత్ సబ్సిడీకి అదనంగా రూ.777 కోట్లు

పెరంబూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉచిత విద్యుత్ అందిస్తున్న, విద్యుత్ బోర్డుకు అదనంగా రూ.777 కోట్ల సబ్సిడీ అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విద్యుత్ క్రమబద్ధీకరణ కమిషన్ సూచించింది. రాష్ట్రంలో గృహాలకు వంద యూనిట్లు ఉచితంగా, 500 యూనిట్ల వరకు సబ్సిడీపై విద్యుత్ కేటాయిస్తున్నారు. అలాగే, రైతులు, గుడిసెలు, చేనేత తదితర విభాగాలకు సబ్సిడీ ధరకు విద్యుత్ అందిస్తున్నారు. ఇందుకోసం విద్యుత్ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ చెల్లిస్తోంది. ఆ ప్రకారం, 2025-26వ ఆర్థిక సంవత్సరంలో అన్ని విభాగాలకు కలిపి రూ.16,274 కోట్లు సబ్సిడీ చెల్లించాలని ప్రభుత్వానికి విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ మార్చిలో ఉత్తర్వులు జారీచేసింది. ఈ క్రమంలో జూన్ 1వ తేది నుంచి విద్యుత్ చార్జీలు 3.16 శాతం పెంచారు. అందువల్ల బోర్డుకు ఏర్పడే అదనపు వ్యయానికి రూ.777 కోట్లు అదనంగా సబ్సిడీ అందించాలని కమిషన్ ఉత్తర్వులు జారీచేసింది.

పబ్లిక్ పరీక్షలకు కొత్త కేంద్రాలు

పెరంబూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలకు కొత్త పరీక్షా కేంద్రాల ఏర్పాటుకు పాఠశాలల వివరాలు ఈ నెల 15వ తేదిలోపు పంపించాలని పరీక్ష శాఖ ఆదేశించింది. ఈ మేరకు పరీక్ష శాఖ డైరెక్టర్ కె.శశికళ, అన్ని జిల్లాల ప్రధాన విద్యాధికారులకు పంపిన సర్క్యులర్‌లో... ప్రస్తుత విద్యా సంవత్సరం (2025-26)లో ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల కోసం కొత్తగా పరీక్షా కేంద్రాలు ఏర్పాటుపై అభిప్రాయ సేకరణ జరుపుతున్నారు. ప్రభుత్వ గుర్తింపు లేని, నిబంధనలు పాటించని పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేయరాదని సూచించింది. 10 కి.మీ దూరానికి పైగా పరీక్ష రాసేందుకు వెళ్లే విద్యార్థుల ఇబ్బందులు పరిగణలోకి తీసుకుని, వారు చదువుతున్న పాఠశాలలోనే పరీక్షా కేంద్రం ఏర్పాటుచేయాలని నిర్ణయించామన్నారు. ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాల వివరాలు బయటకు తెలుపకుండా ఈ నెల 15వ తేదిలోపు పరీక్ష శాఖకు పంపించాలని ప్రకటనలో తెలిపారు.

విమానాల రద్దుతో ప్రయాణికుల అవస్థలు

చెన్నై, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి ఆరు విమానాలు రద్దుచేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. చెన్నై నుంచి ముంబై, అండమాన్, శివమొగ్గ తదితర నగరాలకు వెళ్లాల్సిన మూడు విమానాలు, అక్కడి నుంచి నగరానికి రావాల్సిన మూడు విమానాలు రద్దయ్యాయి. ఎలాంటి ప్రకటన లేకుండా విమానాలు రద్దుకావడంతో, వాటికి రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ప్రయాణికులను ఇతర విమానాల్లో పంపనున్నట్లు అధికారులు తెలిపారు.

జీపు గుంతలో పడి సీఐ సహా ముగ్గురికి గాయాలు

చెన్నై, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి జిల్లా ఉళుందూర్‌పేట సమీపంలో పోలీసు వాహనం గుంతలో పడిన ఘటనలో ఇన్‌స్పెక్టర్ సహా ముగ్గురు పోలీసులకు గాయాలయ్యాయి. కళ్లకుర్చి జిల్లా ఎస్పీ కార్యాలయ ఇన్‌స్పెక్టర్ ఇళవరసన్ గురువారం విల్లుపురంలో జరిగే సమావేశానికి పోలీసు జీపులో వెళ్లారు. సమావేశం తరువాత విల్లుపురం నుంచి బయల్దేరగా, జీపును హెడ్ కానిస్టేబుల్ సీతారామన్ నడుపుతున్నాడు. ఉళుందూర్‌పేట సమీపం సేందమంగళం క్రాస్ రోడ్డులో జీపు హఠాత్తుగా అదుపుతప్పి గుంతలో పడింది. ఈ ఘటనలో సీఐ ఇళవరసన్, హెడ్ కానిస్టేబుల్ సీతారామన్, కానిస్టేబుల్ ఇళయరాజాకు గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు వారిని రక్షించి అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పదవి..

ఈపీఎస్‌పై వ్యతిరేక పిటిషన్ తోసివేత

పెరంబూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా ఎడప్పాడి పళనిస్వామి ఎంపికను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చింది. అన్నాడీఎంకే సర్వసభ్య సమావేశం 2022 జూలై 11న నిర్వహించి, పార్టీ ప్రధాన కార్యదర్శిగా పళనిస్వామిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈపీఎస్ ఎంపికను వ్యతిరేకిస్తూ దిండుగల్‌కు చెందిన సూర్యమూర్తి మద్రాసు సివిల్ కోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ కొట్టివేయాలని కోరుతూ పళనిస్వామి దాఖలుచేసిన పిటిషన్‌ను చెన్నై సివిల్ కోర్టు, జూలైలో తోసిపుచ్చింది. సివిల్ కోర్టు ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ పళనిస్వామి తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ న్యాయమూర్తి పీపీ బాలాజి విచారించగా, 2018 నుంచి సూర్యమూర్తి పార్టీ సభ్యుడు కాదని, పార్టీ సభ్యత్వం లేనివారికి పార్టీ వ్యవహారాలు ప్రశ్నించే అధికారం లేదని పళనిస్వామి తరఫున కోర్టుకు వివరించారు. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎడప్పాడి నియోజకవర్గంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిపై సూర్యమూర్తి పోటీచేశారని వాదించారు. కాగా ప్రధాన కార్యదర్శిని సభ్యులు ఎన్నుకోవాల్సిన ఉంటుందని పార్టీ వ్యవస్థాపకులు ఎంజీఆర్ నిర్ణయాన్ని అతిక్రమించడంతో పాటు పార్టీ విధి విధానాలు మార్చారని సూర్యమూర్తి తరఫు న్యాయవాది వాదించారు. ఇరుతరఫు వాదనల అనంతరం పళనిస్వామి దాఖలుచేసిన పిటిషన్‌పై తీర్పు వాయిదావేశారు. ఈ కేసులో ఎడప్పాడి పళనిస్వామి సమర్పించిన వాదనలు అంగీకరిస్తూ, సూర్యమూర్తి కేసును కొట్టివేయడానికి నిరాకరించిన సివిల్ కోర్టు ఉత్తర్వులు రద్దు చేస్తూ గురువారం న్యాయమూర్తి బాలాజి ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, చెన్నై సివిల్ కోర్టులో సూర్యమూర్తి దాఖలుచేసిన కేసు నిరాకరిస్తున్నట్లు న్యాయమూర్తి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈపీఎస్‌ను విమర్శించలేదు

● ప్రేమలత

ప్యారీస్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తనకు సోదరుడితో సమానమని, ఆయన్ని వ్యక్తిగతంగా విమర్శించలేదని, అయితే మీడియాలో తాను విమర్శించినట్లు వస్తున్న కథనాలు అవాస్తవమని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత పేర్కొన్నారు. ఇటీవల చెంగల్పట్టు జిల్లా మేల్‌మరువత్తూరులో జరిగిప ఓ వివాహ వేడుకల్లో పాల్గొన్న ప్రేమలత తమ పార్టీకి రాజ్యసభ సీటు కేటాయిస్తామని ఇచ్చిన హామీని ఈపీఎస్ నిలబెట్టుకోకుండా వెన్నుపోటు పొడిచారని విమర్శించినట్లు సోషల్‌మీడియాలో ప్రత్యేక కథనాలు ప్రసారమయ్యాయి. ఈ కథనాలు వాస్తవం కాదని తన ప్రసంగాన్ని సోషల్ మీడియా వక్రీకరించి తప్పుడు ప్రచారం చేసిందని, ఇది ఖండించదగ్గదని గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన పత్రికలు వాస్తవ కథనాలను మాత్రమే ప్రజల్లో తీసుకెళ్లాలని, రెండు రాజకీయ పార్టీల నేతల మధ్య చిచ్చుపెట్టే విధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య విరుద్ధమని ప్రేమలత ఆగ్రహం వ్యక్తంచేశారు.

బాణసంచా ప్రకటనలపై చర్యలు తీసుకోవాలి

● సైబర్ క్రైమ్ పోలీసులకు హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు

ప్యారీస్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆన్‌లైన్ బాణసంచా విక్రయాలకు సంబంధించిన ప్రకటనలపై కేసు నమోదు చేసి విచారణ జరపాలని సైబర్ క్రైమ్ పోలీసులకు హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. తమిళనాడు బాణసంచా వ్యాపారుల సమాఖ్య అధ్యక్షుడు రాజచంద్రశేఖరన్ హైకోర్టు మదురై బెంచ్‌లో ఓ పిటిషన్ వేశారు. అందులో బాణసంచా విక్రయాలను నిషేధిస్తూ 2019లో సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీచేసిందని, ఈ నేపథ్యంలో, దీపావళి పండుగ దగ్గరపడుతుండటంతో ఆన్‌లైన్ బాణాసంచా విక్రయాలకు సంబంధించిన ప్రకటనలు అధిక సంఖ్యలో వస్తున్నాయని, ఇది సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించినట్లేనని, అందువల్ల ఇలాంటి ప్రకటనలు చేసేవారిపై చర్యలు తీసుకునేలా పోలీసులను ఆదేశించాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్ న్యాయమూర్తి జస్టిస్ సుందరమోహన్ ముందు గురువారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరుపున సీనియర్ న్యాయవాది సుభాష్‌బాబు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల తరుపున న్యాయవాదులు హాజరై వాదించారు. ఈ వ్యవహారంపై సైబర్ క్రైం ఎస్పీకి కొత్తగా ఫిర్యాదు చేయాలని పిటిషనర్‌కు సూచించి, దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసులకు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

గుట్కా ప్యాకెట్లు తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

వేలూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడి సమీపంలోని చట్టవిరుద్ధంగా గుట్కా ప్యాకెట్లు తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. కాట్పాడి సమీపంలోని విరుదంబట్టు పోలీసుస్టేషన్ పరిధిలోని గాంధీనగర్ ప్రాంతంలో ప్రభుత్వ నిషేధించిన హాన్స్, గుట్కాల ప్యాకెట్లను విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ దయాళన్ నేతృత్వంలోని పోలీసులు ఆ ప్రాంతంలో నిఘా వేశారు. ఈ నేపథ్యంలో, బుధవారం రాత్రి అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని తనిఖీ చేయగా, వారి దగ్గర రాష్ట్రంలో నిషేధించిన గుట్కా ప్యాకెట్లు, హాన్స్ తదితరాలు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకుని, వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

నాన్ ముదల్‌వన్ పథకంపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

వేలూరు, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): వేలూరులోని ఊరీసు కళాశాలలో గురువారం ఉదయం కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన విద్యార్థినులకు నాన్ ముదల్‌వన్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ సుబ్బులక్ష్మి మాట్లాడుతూ పేద విద్యార్థులను ప్రోత్సహించేలా రాష్ట్రప్రభుత్వ 'నాన్ ముదల్‌వన్' పథకాన్ని అమలుచేస్తోందని దీని కోసం ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని ఆమె సూచించారు. జిల్లా ప్రధాన విద్యాశాఖ అధికారి దయాళన్, ఊరిసు కళాశాల ప్రిన్సిపాల్ ఆనిమేరీ ఫ్లారెన్స్ సహా పలు శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తగ్గని సినిమా టిక్కెట్ల ధరలు

● ప్రేక్షకుల అసంతృప్తి

చెన్నై, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గినా, సినిమా టిక్కెట్ల ధరలు తగ్గకపోవడంతో ప్రేక్షకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీలో బుధవారం జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో జీఎస్టీ పన్ను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంతో పలురకాల వస్తువులతో పాటు సినిమా టిక్కెట్ల ధరలు కూడా తగ్గుతాయని ప్రేక్షకులు భావించారు. కానీ, వారికి నిరాశే మిగిలింది. ఆ ప్రకారం, రూ.100 ధర కంటే తక్కువగా ఉన్న థియేటర్లలో టిక్కెట్లపై ఉన్న పన్ను 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గింది. అదే సమయంలో, ఆ థియేటర్లలో టిక్కెట్ల ధరలు తగ్గినా, వాటిలో పాత సినిమాలే ప్రదర్శిస్తుండడంతో ప్రేక్షకులకు నిరాశ మిగిలింది. చెన్నై సహా ప్రధాన నగరాల్లో రూ.100కి పైగా ఉన్న టిక్కెట్ల ధరల్లో ఎలాంటి మార్పు లేదు. ఈ విషయమై థియేటర్ల యజమానుల సంఘం అధ్యక్షులు తిరుప్పూర్ సుబ్రమణియన్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఏ థియేటర్‌కు వెళ్లినా రూ.100కు తక్కువగా టిక్కెట్ల ధరలు లేవన్నారు. నగరంలోని థియేటర్లలో టిక్కెట్లపై విధిస్తున్న 18 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని కోరినా ఫలితం లేకపోయిందని తెలిపారు.

భార్యతో గొడవ.. భర్త ఆత్మహత్య

అడయార్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడులో భార్యతో గొడవ పడిన ఇంజనీర్ ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు కోయంబేడు చిన్మయా నగర్‌కు చెందిన కుమార్ (32) తేనాంపేటలోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. ఈ యనకు భార్యకు మధ్య మనస్పర్థలు తలెత్తడంతో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భార్య తన బిడ్డను తీసుకుని పుదుక్కోట వెళ్ళింది. ఈ నేపథ్యంలో కుమార్ ఇంటిలోనే ఫ్యానుకు ఉరేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనంచేసుకుని పోస్టుమార్టంకు తరలించారు.

లిఫ్ట్ అడిగిన మహిళ నుంచి రూ.50 వేల చోరీ

చెన్నై, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): లిఫ్ట్ అడిగి వెళ్లిన మహిళ నుంచి రూ.50 వేలు నగదు చోరీచేసిన మరో మహిళ కోసం పోలీసులు గాలిస్తున్నారు. నామక్కల్ జిల్లా గణేశపురం ప్రాంతానికి చెందిన రంగనాథన్ భార్య వసంతకుమారి (61) బుధన్‌సంధై ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో హెడ్ నర్సుగా పనిచేసి, పదవీ విరమణ పొందింది. బుధవారం వసంతకుమారి పాలపాళయంలోని తన తల్లి ఇంటికి వెళ్లేందుకు రోడ్డుపై నిలబడి ఉంది. వసంత కుమారి బ్యాగులో రూ.50వేలుంది. ఆ సమయంలో, అటుగా మోపెడ్‌పై వచ్చిన 35 ఏళ్ల మహిళను వసంతకుమారి లిఫ్ట్ అడిగింది. ఆ మహిళ వసంతకుమారిని మోపెడ్‌పై ఎక్కించుకుని, ఆమె చేతిలోని బ్యాగును మోపెడ్ ముందుంచింది. ఓ నిర్మానుష్యమైన ప్రదేశానికి తీసుకెళ్లిన ఆ మహిళ మోపెడ్ ఆపి, వసంతకుమారి మెడలోని బంగారు చైన్ లాగేందుకు యత్నించింది. వసంతకుమారి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకునే సరికి ఆ మహిళ మోపెడ్‌తో పరారైంది. వసంతకుమారి ఫిర్యాదు మేరకు పుదుసత్రం పోలీసులు, కిలాడి మహిళ కోసం గాలిస్తున్నారు.

న్యాయవాది హత్యకేసులో పదిమందికి బెయిల్ నిరాకరణ

చెన్నై, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టు న్యాయవాది హత్య కేసు నిందితులు పది మందికి బెయిలు ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. తిరుప్పూర్ జిల్లా తారాపురం ముత్తునగర్‌కు చెందిన మురుగానందం (41) మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. మురుగానందంకు, అతడి చిన్నాన్నకు మధ్య కుటుంబ తగాదాలున్నాయి. ఈ క్రమంలో జూలై 28న కిరాయి ముఠా చేతిలో న్యాయవాది మురుగానందం హత్యకు గురయ్యాడు. ఈ కేసుకు సంబంధించి మురుగానందం చిన్నాన్న సహా 17 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో, ఈ కేసులో అరెస్టయిన దండపాణి, నాట్టుదురై, దక్షిణామూర్తి సహా పది మంది బెయిలు కోరుతూ జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో వేర్వేరు పిటిషన్లు వేశారు. వీరికి బెయిలు ఇచ్చేందుకు మృతుడి తల్లి, పోలీసు శాఖ అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసు విచారణలో ఉన్నందున, వారిని బెయిలు ఇవ్వరాదని తెలిపారు. వారి వాదన పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి గుణశేఖరన్, బెయిలు తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేశారు.

మద్యానికి బానిసైన అన్నను హతమార్చిన సోదరుడు

చెన్నై, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన అన్నపై తమ్ముడు కత్తితో దాడిచేసి హతమార్చిన ఘటన అయనావరంలో చోటుచేసుకుంది. అయనావరం కరియమాణిక్యం పిళ్లై వీధికి చెందిన శివ (33) చెన్నై మెట్రోవాటర్ బోర్డు కార్యాలయంలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శివ అన్న బాబు (45)కు భార్య మీనా, ఇద్దరు పిల్లలున్నారు. రెండున్నరేళ్ల క్రితం భర్తతో ఏర్పడిన విభేధాల కారణంగా మీనా అతడిని విడిచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి బాబు తమ్ముడు శివ ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో, బాబు మద్యానికి బానిసకాగా, శివ పలుమార్లు మద్యం మానేయాలని సూచించేవాడు. గురువారం ఉదయం వారి మధ్య మళ్లీ వివాదం తీవ్రస్థాయికి చేరి, బాబుపై శివ కత్తితో దాడిచేసి, ఇంటికి తలుపులు వేసి బయటకు వెళ్లిపోయాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలతో బాబు ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. వీరింటి తలుపులు చాలాసేపటి వరకు తెరవకపోవడంతో అనుమానించిన చుట్టుపక్కల వారు అయనావరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని తలుపులు తెరచి చూసి, రక్తపుమడుగుల్లో ఉన్న బాబు మృతిచెందినట్లు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు, శివను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టుకు బాంబు బెదిరింపు



కోర్టులో తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్

పెరంబూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడ్‌వే సమీపం మద్రాసు హైకోర్టు ప్రాంగణంలో ఉన్న ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టుకు గురువారం బాంబు బెదిరింపు వచ్చింది. ఈ-మెయిల్ ద్వారా వచ్చిన బాంబు బెదిరింపు సమాచారాన్ని కోర్టు ఉద్యోగులకు పోలీసులకు తెలిపారు. డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌తో అక్కడకు చేరుకున్న పోలీసులు, కోర్టు విచారణ గది, ప్రాంగణాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి, ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. ఇదిలా వుండగా ఈ-మెయిల్ చిరునామా కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బక్కెట్లో జారిపడి ఏడాదిన్నర చిన్నారి మృతి



గుణశ్రీ (ఫైల్‌ఫోటో)

పెరంబూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడలూరులో ఇంట్లో నీళ్లతో ఉన్న బక్కెట్లో జారిపడి ఏడాదిన్నర చిన్నారి మృతిచెందిన ఘటన విషాదానికి దారితీసింది. కడలూరు కేఎన్ పేట ప్రాంతానికి చెందిన శివశంకరన్-జ్ఞానసుందరి దంపతులకు 2023లో కవల ఆడపిల్లలు జన్మించారు. గురువారం ఉదయం శివశంకర్ చిన్న పాపతో ఆడుకుంటుండగా, పెద్ద పాప గుణశ్రీ ఇంట్లో బక్కెట్లో ఉన్న నీళ్లతో ఆడుకుంటూ బక్కెట్లు పడిపోయింది. కొద్దిసేపటి తర్వాత గుణశ్రీ కనిపించలేదని ఇంట్లో గాలించిన తల్లిదండ్రులు, బక్కెట్లో మునిగి అచేతనంగా పడిన గుణశ్రీని గమనించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నీటితొట్టెలో పడి ఏడాదిన్నర చిన్నారి మృతి

తిరుత్తణి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నీటితొట్టెలో పడి ఒకటిన్నరేళ్ల చిన్నారి మృతిచెందిన ఘటన తిరువళ్లూరు జిల్లా కడంబత్తూరు సమీపంలోని సెంజిప్పనపాక్కంలో చోటుచేసుకుంది. ఆ ప్రాంతానికి చెందిన కార్తిక్-ఈశ్వరి దంపతులకు సుభాషిణి (7) గిరీష్ (ఏడాదిన్నర)అనే పిల్లలు ఉన్నారు. ఈ నేపథ్యంలో, గురువారం ఉదయం ఆటలాడుకుంటున్న సమయంలో గిరీష్ తన ఇంటిముందున్న నీటితొట్టెలో పడి మృతిచెందాడు. కొద్దిసేపటి తర్వాత గిరీష్ కనిపించలేదని ఇంట్లో గాలించిన తల్లిదండ్రులు, నీటితొట్టెలో పడి ఉన్న గిరీష్‌ను గమనించి వెంటనే కడంబత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు.

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో మంత్రి దురైమురుగన్‌కు వారెంట్

చెన్నై, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటివపారుదల శాఖ మంత్రి దురైమురుగన్‌పై అరెస్ట్ వారెంట్‌ను ఈ నెల 15వ తేదిలోగా అమలుచేయాలని న్యాయస్థానం ఆదేశించింది. ప్రస్తుతం డీఎంకే ప్రధాన కార్యదర్శిగా కూడా వున్న దురైమురుగన్ 1996-2001లో కరుణానిధి నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వ హయాంలో ప్రజాపనుల శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో దురైమురుగన్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని ఆరోపణలు తలెత్తాయి. అనంతరం అధికారం చేపట్టిన అన్నాడీఎంకే దురైమురుగన్ తన ఆదాయానికి మించి రూ.3.92 కోట్ల మేరకు ఆస్తులు కూడబెట్టారని కేసు పెట్టి, ఏసీబీకి అప్పగించింది. ఈ వ్యవహారంపై మంత్రి దురైమురుగన్, ఆయన భార్య, కుమారుడు, కోడలు, సోదరులు తదితరులపై కేసు నమోదైంది. ఈ కేసు వేలూరు ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో విచారణ జరిగిన సమయంలో మంత్రి దురైమురుగన్, ఆయన కుటుంబ సభ్యులను కేసు నుండి విడుదల చేస్తూ న్యాయమూర్తి 2007లో తీర్పునిచ్చారు. ఈ తీర్పును పునఃపరిశీలించాలని కోరుతూ 2013 అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ఏసీబీ హైకోర్టులో అప్పీలు పిటిషన్ వేసింది. ఈ కేసు విచారణకు వచ్చిన సమయంలో దురైమురుగన్ తరఫున హాజరైన న్యాయవాది... ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి ఆస్తులను కూడా దురైమురుగన్ ఆస్తులుగా చూపారని, ఈ పిటిషన్ రద్దు చేయాలని కోరారు. అదే సమయంలో ఏసీబీ తరఫున హైకోర్టులో నివేదిక దాఖలుచేశారు. ఈ కేసులో వాదనలు ముగిసిన అనంతరం హైకోర్టు.. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో దురైమురుగన్‌ను విడుదలకు సంబంధించిన ఉత్తర్వులు రద్దు చేస్తూ ఏసీబీ దాఖలుచేసిన పునఃపరిశీలన పిటిషన్ కిందపై విచారణ చేపట్టి, ఆరు నెలల్లో ముగించాలని వేలూరు ప్రత్యేక కోర్టును ఆదేశించింది. ప్రస్తుతం చెన్నై ప్రత్యేక కోర్టులో దురైమురుగన్‌కు వ్యతిరేకంగా దాఖలైన కేసు విచారణ నడుస్తోంది. మొదట ఈ కేసులో దురైమురుగన్, ఆయన భార్య స్వయంగా కోర్టుకు హాజరుకావాలని ఉత్తర్వులు జారీచేశారు. దీంతో, దురైమురుగన్, ఆయన భార్య కోర్టుకు హాజరై వారెంట్ రద్దు చేయాలని కోరగా, న్యాయస్థానం అంగీకరించింది. అయితే గురువారం జరిగిన కేసు విచారణకు దురైమురుగన్ గైర్హాజరవ్వడంతో ఆయనకు గతంలో జారీ చేసిన పీటీ వారెంట్‌ను ఈ నెల 15వ తేదిలోగా అమలుచేయాలని పోలీసుశాఖను న్యాయాధికారి ఆదేశించారు. 15 లోపు దురైమురుగన్ నేరుగా తమ ముందు హాజరు కాని పక్షంలో అరెస్టుకు ఆదేశిస్తామని హెచ్చరించారు.

ఆధ్యాత్మికం

చుట్టూ పచ్చని పంటపొలాలు, ఎత్తయిన కొండలతో ఆహ్లాదకర వాతావరణంలో గాంభీర్యంగా దర్శనమిస్తుంది కాళిపట్టి కందసామి ఆలయం. సేలం - నామక్కల్ సరిహద్దులో తిరుచెంగోడు తాలూకా కాళిపట్టి అనే గ్రామంలో కందసామి ఆలయం ఉంది. ఈ ఆలయంలో ఎండిన చెరకుగెడలు కాల్చగా వచ్చే బూడిద రోగాలను నయం చేసే దివ్యౌషధం. ఈ ఆలయ ప్రాంగణంలో ఆంగ్లేయుల కాలం నుంచి ఇప్పటి వరకు తైపూస వేడుకల్లో ప్రత్యేక కోర్టు నిర్వహిస్తున్నారు. ఇంతటి విశేషాలను సంతరించుకున్న ఈ ఆలయంలో దండాయుధపాణి స్వామి భక్తుల కోర్కెలను నెరవేర్చుతున్నారు. కాళిపట్టి కందసామి ఆలయ విశేషాల సమాహారం నేతి ఆధ్యాత్మికం...

- టి.నగర్, ఆంధ్రజ్యోతి





ఆలయ ప్రవేశద్వారం - గర్భాలయ విమానం - ఆలయ ముఖమంటపం

దండాయుధపాణి క్షేత్రం
చెరకు బూడిదే దివ్యౌషధం



తైపూస రథోత్సవ దృశ్యం

- తైపూసం ప్రత్యేక కోర్టులో కేసులకు పరిష్కారం
- కోర్కెలు నెరవేర్చే కాళిపట్టి కందసామి



వళ్లి, దైవానై సమేత కందసామి

స్థలపురాణం...

పూర్వం ఈ ప్రాంతంలో మురుగన్ భక్తుడు నివసించేవారు. ప్రతియేటా తైపూస పర్వదినాన ఆయన వ్రతమాచరించి కాలినడకనే పళని క్షేత్రానికి వెళ్లి దండాయుధపాణి స్వామిని దర్శించుకునేవారు. కొన్ని దశాబ్దాలపాటు ప్రతియేటా తైపూసం పర్వదినాన క్రమం తప్పకుండా పళనికి తీర్థయాత్రగా వెళ్లే ఆ భక్తశిఖామణి వృద్ధాప్య సమస్యలతో ఓ యేడాది పళని వెళ్లలేకపోయారు. ఆరోగ్యం సహకరించలేకపోయినా పట్టుదలతో పళని వెళ్ళాలని నిర్ణయించుకుని అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఆ రోజు రాత్రి మురుగప్పెరుమాన్ ఆయనకు కలలో కనిపించి ఇకపై తన దర్శనం కోసం పళని క్షేత్రానికి రానవసరం లేదని, తానే ఆ భక్తుడున్న ప్రాంతంలోనే స్థిరనివాసమేర్పరచుకోవాలని నిర్ణయించుకున్నానని, తన కోసం ఓ ఆలయాన్ని నిర్మించమని ఆదేశించారు. స్వామివారి ఆజ్ఞ మేరకు ఆ భక్తుడు కాళిపట్టి వద్ద కందస్వామి ఆలయాన్ని నిర్మించారు. స్వామివారు ఆ ఆలయంలో దండాయుధపాణిగా ఆవిర్భవించారు.

ఆలయవైభవం... : ఈ ఆలయం సుమారు మూడు శతాబ్దాలనాటిదని చరిత్రకారులు చెబుతున్నారు. ఆలయం పడమటి దిశగా నిర్మించారు. ఆలయ ప్రవేశద్వారం వద్ద ఐదంతస్థుల రాజగోపురం కనిపిస్తుంది. ఆలయంలో మూలవర్లుగా కందసామి నిలిచిన భంగిమలో భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఆలయ వెలుపలి ప్రాకారం ఉత్తర దిశగా ఇడుంబన్ సన్నిధి ఉంది. అక్కడికి కాస్త దూరంలో వినాయకుడు, శనీశ్వరుడు, వేలాయుధ స్వామి ఉప సన్నిధులున్నాయి. ఈ ఆలయంలో మురుగన్ భక్తులకు విభూదికి బదులు ఎండిన చెరకుగెడ ముక్కలను కాల్చి బూడిద చేసి దానినే ప్రసాదంగా ఇస్తారు. ఈ ప్రసాదం ఔషధగుణాలు కలిగి ఉంటుందని, నలుపురంగులో ఇసుకలా ఉన్న దీనిని తమిళంలో 'అరుమరుందు' (దివ్యౌషధం) అని భక్తులు చెబుతున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల రైతులు చెరకు పంట వేయడానికి ముందుగా ఆలయానికి వెళ్లి పంటలు సమృద్ధిగా పండించు... నీ ప్రసాదం తయారీకి చెరకు గెడలను కానుకగా సమర్పించుకుంటాం' అని ప్రతిజ్ఞ చేయడం ఆనవాయితీ. స్వామివారికి ఇచ్చిన మాట ప్రకారమే వ్రతమాచరించి కొన్ని చెరకుగెడలను బాగా ఎండబెట్టి కాల్చి బూడిద చేసి, శుభ్రపరచి ఆలయానికి కానుకగా ఇస్తున్నారు. చెరకు రైతులిచ్చిన ఈ బూడిదను మూలవిరాట్టు దగ్గర ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన మీదట భక్తులకు ప్రసాదంగా ఇస్తున్నారు. రైతులు కూడా తమ పశువులకు ఏదైనా రోగాలు వస్తే దీనినే ఔషధంగా ఇస్తున్నారు.

ఆలయ విశేషాలు... : ఈ ఆలయంలోని మూలవిరాట్టుకు క్షీరాభిషేకం చేస్తే భక్తులు తలచిన కార్యం నెరవేరుతుందని శైవాగమ పండితులు చెబుతున్నారు. వైకాశి, విశాఖం వంటి దినాల్లో మురుగప్పెరుమాన్‌కు క్షీరాభిషేకం చేస్తే వివాహయోగం, సంతానం కలుగుతుందని కూడా చెబుతారు. ఈ ఆలయంలో తైపూసవేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఆ వేడుకల్లోనే రథోత్సవం జరుగుతుంది. ఆ రోజున భక్తులు కావళ్లు వెూసుకొచ్చి స్వామివారికి సమర్పించి మొక్కుబడులు చెల్లించుకుంటారు. ఆ వేడుకల్లో కావడి ఆట్టమ్, మయిలాట్టం, ఒయిలాట్టం వంటి తమిళ సంప్రదాయ, జానపద నృత్య ప్రదర్శనలు కూడా జరుగుతాయి.

తైపూసంలో ప్రత్యేక కోర్టు

ఆంగ్లేయుల కాలంలో అధిక సంఖ్యలో భక్తులు చేరే ప్రాంతాలు, వేడుకలు జరిగే క్షేత్రాల వద్ద ప్రత్యేకంగా కోర్టు నిర్వహించి త్వరితగతిన కేసులను పరిష్కరించి అప్పటికప్పుడే తీర్పు చెప్పేవారు. ఈ ఆలయం వద్ద కూడా ఆంగ్లేయుల కాలంలో తైపూస దినాల్లో ప్రత్యేక కోర్టు నిర్వహించేవారు. ఆ ఆనవాయితీ ఇప్పటికీ కొనసాగుతుండటం విశేషం. తైపూసం వేడుకల్లో నాలుగు రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక కోర్టు నిర్వహించి, నేరస్థులకు అప్పటికప్పుడే శిక్షలను విధిస్తున్నారు. ఇదే విధంగా ఆలయానికి ఎదురుగా ఉన్న మైదానంలో ఎన్నో శతాబ్దాలుగా పశువుల సంత కూడా నిర్వహిస్తున్నారు.

ఎలావెళ్ళాలి?

సేలం - తిరుచెంగోడు మార్గంలో తిరుచెంగోడుకు సుమారు 22 కి.మీ.ల దూరంలో కాళిపట్టి మురుగన్ ఆలయం ఉంది. తిరుచెంగోడుకు రాజధాని నగరం చెన్నై సహా పలు నగరాల నుండి బస్సులు నడుపుతున్నారు. తిరుచెంగోడు బస్టాండు నుండి కాళిపట్టికి వెళ్లేందుకు టౌన్ బస్సులు, షేర్ ఆటోలు, టాక్సీలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ ఆలయాన్ని రోజూ ఉదయం 6 నుండి రాత్రి 7.30 గంటల దాకా తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తున్నారు.

తాను ఏ స్థానం కోసం ఆశపడటం లేదనీ, ఏ స్థానమైనా ప్రేక్షకులు ఇవ్వాలని శివకార్తికేయన్ పేర్కొన్నారు. ఆయన హీరోగా నటించిన 'మదరాసి' చిత్రం శుక్రవారం ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతోంది. ప్రముఖ దర్శకుడు ఏఆర్.మురుగదాస్ దర్శకత్వం వహించగా, రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించారు. ఈ సందర్భంగా ఎస్కే ప్రత్యేకంగా మీడియాతో ముచ్చటించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు.....

ఏ స్థానమైనా ప్రేక్షకులు ఇవ్వాలి



- శివకార్తికేయన్
- నేడు 'మదరాసి' విడుదల

చిత్రజ్యోతి

? 'మదరాసి' ఎలాంటి చిత్రం

! ఇది మాస్ కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్ మూవీ. ఈ సినిమా ఒక ఆయుధం (తుపాకీ) గురించి మాట్లాడుతుంది. హీరో విజయ్ నటించిన 'తుపాకీ' కాదు (నవ్వుతూ). ఉత్తరాది నుంచి వచ్చే ఒక విలన్‌ను ఇక్కడ ఉండే హీరో ఎలా ఎదుర్కొంటారన్నదే ఈ చిత్ర కథాంశం. ఇందులో ఎలాంటి సందేశం లేదు. ఇలాంటివి మన ఊరిలో కూడా జరిగేందుకు అవకాశం ఉంది. ఒక హెచ్చరిక లాంటి మూవీ అని చెప్పొచ్చు.

? రజనీకాంత్, విజయ్, సల్మాన్ వంటి అగ్రహీరోలు ఏఆర్.మురుగదాస్ దర్శకత్వంలో నటించారు. అటువంటి దర్శకుడితో కలిసి పనిచేసిన అనుభవం ఎలా ఉంది.

! ఆయన వద్ద పని చేయడం చాలా సులభం. ఎవరినీ టెన్షన్ పెట్టరు. లొకేషన్‌లో చాలా ప్రశాంతంగా ఉంటారు. అందుకే ఆయనతో కలిసి పనిచేయడం ఎంతగానో నచ్చింది. ఈ సినిమాలో మురుగదాస్ స్టోరీలోకి వెళ్లిపోయాను. రెగ్యులర్‌గా నా చిత్రాల్లో ఉండే కామెడీ, సరదా సన్నివేశాలుండవు. రెండో భాగం పూర్తిగా యాక్షన్.

? ఇటీవలి కాలంలో మీరు ఎంచుకునే పాత్రలు 'కోపంగా ఉన్న యువకుడు' (అగ్రెసివ్ యూత్)గా ఉంటున్నాయి. ఈ చిత్ర ట్రైలర్‌లోనూ అలాగే కనిపిస్తున్నారు. ఇలాంటి పాత్రలు ఎంచుకోవడానికి కారణం.

! 'మదరాసి' చిత్ర పాత్ర రూపకల్పనలోనే ఓ విషయం ఉంది. ట్రైలర్‌లో వచ్చే డైలాగ్ చెప్పడానికి ముందు 15 నిమిషాలపాటు యాక్షన్ సీన్స్ ఉంటుంది. దాని పీక్ స్టేజ్ ఆ డైలాగ్. నేను ఉన్నంత వరకు టచ్ చేయలేవనే అర్థంలో చెప్పింది. అది ఒక పంచ్ డైలాగ్‌గా చూడరాదు. అది సన్నివేశాల కొనసాగింపుగా ఉంటుంది.

? ఒక హిట్ మూవీ ఇచ్చిన తర్వాత తదుపరి సినిమా కూడా అలాంటి హిట్ కొట్టాలన్న ఒత్తిడి హీరోగా మీపై ఉంటుందా.

! 'అమరన్' ఒక బయోపిక్ మూవీ. కమర్షియల్‌గా హిట్ సాధించదని చాలా మంది అభిప్రాయపడ్డారు. శివకార్తికేయన్ ఆర్మీ అధికారి పాత్రకు సరిపోరంటూ మాట్లాడారు. కానీ, నేను మరోలా ఆలోచించాను. బయోపిక్ మూవీ కమర్షియల్‌గా ఎందుకు సక్సెస్ సాధించదు? ఆర్మీ అధికారిగా నేను నటించలేనా? అని నాలో నేను ప్రశ్నించుకున్నాను. ఆ చిత్రం రూ.350 కోట్లు సాధిస్తుందని ఎవరూ ఊహించలేదు. ఆ చిత్రం షూటింగ్ సమయంలోనే మురుగదాస్ చిత్రానికి కమిట్ అయ్యారు. ఒక చిత్రం విజయం సాధించాలంటే ప్రకృతితో పాటు అనేక అంశాలుంటాయి. అయితే, నాపై కేవలం ఒకే ఒక ఒత్తిడి మాత్రమే ఉంటుంది. కథను పూర్తిగా ఎలా మోయగలనో అది పూర్తిచేస్తాను.

? 'మదరాసి' చిత్రం షారూక్ ఖాన్‌కు చెప్పిన కథ. ఇపుడు నా వద్దకు వచ్చిందని చెప్పడానికి కారణం.

! ఈ సినిమా షూటింగ్ సమయంలో దర్శకుడు ఒక సందర్భంలో చెప్పారు. షారూక్‌కు కథ చెప్పే సమయానికి స్టోరీ పూర్తిగా సిద్ధం కాలేదు. ఆ తర్వాత నా కోసం ఆ కథను మార్చారు.

? తదుపరి చిత్రాలేంటి?

! 'పరాశక్తి' షూటింగ్ జరుగుతోంది. ఆ సినిమా తర్వాత శిబి చక్రవర్తి, వెంకట్ ప్రభు దర్శకత్వంలో నటిస్తాను.

? రజనీకాంత్ - కమల్ హాసన్, విజయ్ - అజిత్ వేర్వేరు మార్గాల్లో ప్రయాణిస్తున్నారు. వారి తర్వాతి స్థానం మీదేనా.

! నాకు ఎవరి స్థానమూ వద్దు. ఏ స్థానమైనా ప్రేక్షకులు ఇవ్వాలి. వారిచ్చే స్థానమే శాశ్వతమైనది. రాజకీయాలకు నాకు ఆమడ దూరం. అలాంటి ఆలోచనలు ఏవీ లేవు. నా అభిమాన సంఘాలను మంచి పనులకు మాత్రమే ఉపయోగిస్తున్నాం.

ఆరిసర్ బ్రాండ్ అంబాసిడర్‌గా రవీంద్ర జడేజా



జడేజాను అభినందిస్తున్న బీఆర్ అరుణేశ్వర్

చెన్నై, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోజువారీ ఆటగాళ్లకు స్మార్ట్-క్యాజువల్ లేబుల్ అయిన ఆరిసర్.. నేడు భారత క్రికెట్ సంచలనం రవీంద్ర జడేజాను బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించింది. ఈ మేరకు ఆరిసర్ మేనేజింగ్ డైరెక్టర్ బీఆర్ అరుణేశ్వర్ ప్రకటన విడుదల చేశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ.. నిలకడగా ఆడే ఆటగాడి నుంచి భారతదేశంలో అత్యంత నమ్మకమైన ఆల్ రౌండర్లలో ఒకరిగా మారిన జడేజా ప్రయాణం ఆరిసర్ ఆశయం, స్థిరత్వం, శైలి సొంత కథను ప్రతిబింబిస్తుందన్నారు. రవీంద్ర జడేజాను తమ కుటుంబంలోకి స్వాగతిస్తున్నందుకు తాము గర్విస్తున్నామని వివరించారు.

మొబైల్ పీడియాట్రిక్ థెరపీ సేవలకు జీఆర్టీ రూ.58 లక్షల విరాళం



వర్షిణి ఇల్లం ట్రస్టు నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న జీఆర్టీ ప్రతినిధులు

చెన్నై, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రముఖ ఆభరణాల సంస్థ జీఆర్టీ జువెలర్స్ మొబైల్ పీడియాట్రిక్ థెరపీ సేవల కోసం రూ.58,24,758 విరాళాన్ని చెన్నైలోని 'వర్షిణి ఇల్లం ట్రస్ట్'కి అందజేసింది. ఈ మేరకు జీఆర్టీ ప్రతినిధులు ఇటీవల ట్రస్టు నిర్వాహకులకు చెక్కు అందజేశారు. తాము అందించిన మొత్తం సమాజంలోని నిరుపేద పిల్లలకు మొబైల్ పీడియాట్రిక్ థెరపీ సేవలను చేరువ చేసి, వారికి అవసరమైన సంరక్షణ, అభివృద్ధి మద్దతును అందించడంలో విశ్వసనీయమైన సహాయాన్ని అందిస్తుందని నిర్వాహకులు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. 1964లో స్థాపించబడిన జీఆర్టీ జ్యూవెలర్స్ అత్యంత విశ్వసనీయమైన ఆభరణాల సంస్థల్లో ఒకటిగా ఎదిగింది. దక్షిణ భారతదేశంలో 65కి పైగా షోరూంలతో పాటు సమాజ సేవ పట్ల కూడా శాశ్వత నిబద్ధతను కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.

ఓనం పండుగ నేపథ్యంలో పూల ధరలకు రెక్కలు

ప్యారీస్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలో జరుపుకొనే సంప్రదాయ పండగలో అతి పెద్ద పండుగ అయిన ఓనంను శుక్రవారం వామన జయంతిగా జరుపుకునేందుకు రాష్ట్రంలో స్థిరపడిన మలయాళీలు ఏర్పాట్లు చేసుకున్నారు. శ్రావణ నక్షత్రాన్ని మలయాళంలో 'తిరు ఓనం' అంటారు. ఆ రాష్ట్రంలో ఈ పండుగను పది రోజులు కోలాహలంగా జరుపుకోనున్న నేపథ్యంలో, రాజధాని నగరమైన చెన్నైలో ముందుగానే పండుగ వాతావరణం కనిపించింది.

ఓ వైపు ఓనం పండుగ, మరోవైపు శుభ ముహూర్తాలు రోజైన గురువారం స్థానిక కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్లో పూలు, అరిటాకులు, మామిడి, అరటితోరణాల విక్రయాలు జోరుగా సాగాయి. ఎన్నడూ లేని విధంగా మల్లెపూలు కిలో రూ.1,300, వాడమల్లె రూ.350, అరళిపూ రూ.250, ముల్లైరోస్ రూ.200. సంపంగి రూ.300, మనోరంజితం రూ.20, బంతిపూలు రూ.250, అరిటాకుల పెద్దకట్ట రూ.6000లకు విక్రయించారు. దీనిపై మార్కెట్ వ్యాపారుల సంఘ అధ్యక్షుడు ముత్తుకుమార్ మీడియాతో మాట్లాడుతూ... కోయంబేడు మార్కెట్లో రెండు రోజుల క్రితం వరకు పూలు, పండ్లు, కూరగాయల ధరలు సరసమైన ధరలకే విక్రయించామని, అయితే శ్రావణ మాసం చివరి గడియలు, శుభ ముహూర్తాల రోజు కావడం, మరో వైపు ఓనం పండుగ సందర్భంగా ధరలు పెరిగాయని తెలిపారు. తంజావూరు, తూత్తుకుడి, పుదుకోట తదితర జిల్లాల నుంచి నెల్లూరు, చిత్తూరు, కడప తదితర ప్రాంతాల నుంచి అతితక్కువగా కూరగాయలు, పూజా సామగ్రి రావడంతో ధరలు పెంచాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు.





స్థానిక కోయంబేడు మార్కెట్‌లో పూలు, పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

మూడు రెట్లు పెరిగిన విమాన ఛార్జీలు

పెరంబూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలో శుక్రవారం 'ఓనం' పండుగ కోలాహలంగా జరుగనుంది. పండుగ కోసం చెన్నై, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన మలయాళీయులు కుటుంబాలతో సొంత రాష్ట్రానికి పయనమయ్యారు. కేరళకు వెళ్లే రైళ్లలో రిజర్వేషన్ ఇప్పటికే పూర్తవగా, ఆమ్నీ బస్సుల ఛార్జీలు అధికంగా ఉండడంతో, విమానాల్లో వెళ్లేందుకు మలయాళీయులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో, కేరళ రాష్ట్రం తిరువనంతపురం, కొచ్చిన్, కోజికోడ్, కన్నూర్ తదితర నగరాలకు వెళ్లే విమాన ఛార్జీలు పెరిగాయి. ఆ ప్రకారం, చెన్నై-తిరువనంతపురం మధ్య సాధారణ రోజుల్లో రూ.4,359గా ఉన్న ఛార్జీ రూ.19,903కు పెరిగింది. చెన్నై-కొచ్చిన్ ఛార్జీ రూ.3,713 నుంచి రూ.11,798, చెన్నై-కోజికోడ్ ఛార్జీ రూ.3,629 నుంచి రూ.10,286కు పెరిగింది. ఛార్జీలు భారీగా పెరిగినా, త్వరగా స్వరాష్ట్రానికి వెళ్లేందుకు సిద్ధమైన ప్రయాణీకులతో, కేరళ వెళ్లే విమానాలు పూర్తిస్థాయిలో నిండి ప్రయాణించాయి.



చెన్నై విరుగంబాక్కంలోని బాలలోక్ పాఠశాలలో గురువారం నిర్వహించిన 'ఓనం' వేడుకల్లో విద్యార్థులు

అవార్డు ప్రదానం చేస్తున్న కేంద్రమంత్రి



సీఎంసీ వైద్యకళాశాలకు జాతీయ స్థాయి గుర్తింపు

వేలూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్యకళాశాలల గుర్తింపు ఆధారంగా ప్రతిఏటా నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్)వెలువరించిన అవార్డులో వేలూరులోని సీఎంసీ వైద్యకళాశాల ఎంపికయ్యింది. ఈ క్రమంలో ప్రకటనలో భాగంగా భాగంగా గురువారం ఉదయం సీఎంసీ వైద్యకళాశాల ఆడిటోరియంలో అవార్డు ప్రదాన కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సులోమాన్ సతీష్‌కుమార్‌కు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ, ప్రైవేట్ ఆరోగ్య సంరక్షణ మధ్య అంతరాన్ని తగ్గిస్తాం

- 'సేవ్ మామ్' వ్యవస్థాపకులు సెంథిల్ కుమార్



మీడియా సమావేశంలో నిఖిల్ చందన్, సెంథిల్ కుమార్

చెన్నై, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నవయుగ్ మద్దతుతో తాము ప్రభుత్వ, ప్రైవేట్ ఆరోగ్య సరంక్షణ మధ్య అంతరాన్ని తగ్గిస్తామని 'సేవ్ మామ్' సంస్థ వ్యవస్థాపకులు సెంథిల్ కుమార్ పేర్కొన్నారు. 'నవయుగ్ గ్లోబల్ వెంచర్స్'తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకున్న సందర్భంగా ఆ సంస్థ ఎండీ నిఖిల్ చందన్‌తో కలిసి ఇటీవల చెన్నైలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వాసుపత్రుల్లో మా పని గర్భధారణ సమయంలో ప్రాణాలను కాపాడే సాంకేతికత శక్తి నిరూపించిందని వివరించారు. నవయుగ్ ఎండీ నిఖిల్ చందన్ మాట్లాడుతూ.. ఇది కేవలం టెక్నాలజీలో పెట్టుబడి మాత్రమే కాదని, జీవితాల్లో పెట్టుబడి అని వ్యాఖ్యానించారు. నిజమైన సామాజిక సవాళ్లను పరిష్కరించడానికి ఆవిష్కరణలను ఉపయోగించడమని వివరించారు.

'శివ' సేవలు ప్రశంసనీయం

- సామూహిక వివాహ కార్యక్రమంలో వక్తలు



నూతన వధూవరులతో నిర్వాహకులు, అతిథులు

ప్యారీస్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యతగా ఇప్పటి వరకు 409 జంటలకు ఉచితంగా వివాహాలు జరిపించిన సదరన్ ఇండియా వైశ్య సంఘం (శివ)సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ప్యారీస్ గిడ్డంగి వీధిలో ఉన్న సదరన్ ఇండియా వైశ్య సంఘం నిర్వహణలోని ఆర్యవైశ్య సామూహిక వివాహ సంస్థ ఆధ్వర్యంలో 45వ వార్షిక కార్యక్రమంగా గురువారం ఉదయం కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఎం.భరణీధరన్, జి.రమ్యశ్రీ అనే జంటకు 409వ వివాహం ఘనంగా జరిపించారు. సంఘ అధ్యక్షుడు అజంతా డా.కనిగెలుపుల శంకరరావు అధ్యక్షోపన్యాసం చేస్తూ... 17వ శతాబ్దం నుంచి దాదాపు 120 సంవత్సరాలుగా తమ సంఘం ఆధ్యాత్మిక, క్రీడ, అన్నదానం, విద్యాదానం తదితర సేవా కార్యక్రమాల్లో ముందుందని తెలిపారు. వివాహం చేసుకునే స్థోమత లేని జంటలకు సంస్థ తరఫున అమ్మవారి సమక్షంలో శాస్త్రోక్తంగా వివాహం జరిపిస్తున్నామని, వధూవరులకు మంగళసూత్రం, పట్టువస్త్రాలు, గృహ సామగ్రిని కానుకగా అందజేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా కేఆర్ విద్యాసంస్థల సీఈవో ఆర్‌జే భువనేష్, గౌరవ అతిథులుగా డాక్టర్ టి.వసంతగౌరి, పబ్బిశెట్టి బాలాజీ హాజరై శివ ఆధ్వర్యంలో చేస్తున్న ఆధ్యాత్మిక, సామాజిక సేవలను కొనియాడారు. సంఘ సంయుక్త కార్యదర్శులు మద్ది నరసింహలు, పువ్వాడ అశోక్‌కుమార్, కోశాధికారి పెనల రమేష్, వివాహ సంస్థ ఛైర్మెన్ సీఏ శేఖర్, కార్యదర్శి టీజీ పార్థసారధి, ఉపాధ్యక్షులు మన్నారు ఉదయకుమార్, కాశీవిశ్వనాథం, తాతా నిరంజన్, కోటా గాయత్రి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అజంతా శంకరరావు అతిథులతో కలసి వధూవరులను ఆశీర్వదించడంతో పాటు ఈ కార్యక్రమానికి ఆర్థికంగా సహకారం అందించిన దాతలకు మెమెంటోలు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు.

కన్నతండ్రే కాలయముడు


హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్న బంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

లోకం తీరు



ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్ల దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో 'హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

» జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- » కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- » ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- » తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- » తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- » సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.


ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోధా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు


బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుదిశ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

పెంపుడు శునకాలకు 'మైక్రో చిప్'

● అమర్చకుంటే రూ.3,000 జరిమానా




పెరంబూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు శునకాల బెడద అధికమవుతున్న నేపథ్యంలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) అధికారులు కఠిన చర్యలకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా పెంపుడు శునకాలకు 'మైక్రో చిప్' అమర్చాలంటూ గతంలో జారీ చేసిన ఉత్తర్వులను కఠినంగా అమలు చేయాలని నిర్ణయించారు. ఇకపై పెంపుడు శునకాలకు మైక్రోచిప్ అమర్చని యజమానులకు రూ.3వేల జరిమానా విధిస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో కొద్దిరోజులుగా వీధి శునకాల బెడద అధికమవుతోంది. వీధి శునకాలు పాదచారులపై దాడి చేసే ఘటనలు ప్రతిరోజూ సంభవిస్తున్నాయి. దీనికి తోడు పెంపుడు శునకాలు కూడా ప్రజలపై దాడిచేస్తున్న ఘటనలున్నాయి. తాము పెంచుకునే శునకాల వయసు పైబడడమో, అనారోగ్యం పాలవడమో జరిగితే ఆయా యజమానులు వాటిని రోడ్లపై వదిలేస్తున్నారు. అప్పటి వరకూ యజమానుల ఆలనాపాలనా పొందిన శునకాలు.. ఒక్కసారిగా రోడ్డున పడడంతో అవి భయభ్రాంతులకు గురై కనిపించినవారిపై దాడి చేస్తున్నాయి. ఈ వ్యవహారంపై సత్వర చర్యలు చేపట్టాలని నిర్ణయించిన జీసీసీ పెంపుడు శునకాలకు మైక్రో చిప్ అమర్చాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులు అక్టోబరు నుంచి అమలుకు రానున్నాయి.

12,500 పెంపుడు శునకాలు...

జీసీసీ పరిధిలో 12,500 పెంపుడు శునకాలకు మాత్రమే లైసెన్స్ పొందగా, లైసెన్స్ పొందని పెంపుడు శునకాల వివరాలు సేకరిస్తున్నట్టు జీసీసీ అధికారులు తెలిపారు. పెంపుడు శునకాలకు మైక్రో చిప్ అమర్చాలనిజనవరిలో నిర్వహించిన జీసీసీ కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. ఆ ప్రకారం, శునకాలకు మైక్రో చిప్ అమర్చేందుకు మైక్రో చిప్ కొనుగోలు, అమర్చడంపై ప్రభుత్వ, ప్రైవేటు వెటర్నరీ ఆరోగ్య కేంద్రాలకు త్వరలో విధివిధానాలు వెలువరించనున్నట్లు తెలిపిన జీసీసీ అధికారులు, పెంపుడు శునకాలను బయటకు తీసుకెళ్లే సమయంలో వాటి మూతిని తప్పక మూసివేసేలా పరికరం ఏర్పాటుచేయాలని యజమానులకు సూచించారు. అలాగే, నగరంలోని 1.80 లక్షల వీధి శునకాలకు వచ్చే ఏడాది ఫిబ్రవరిలోపు ర్యాబిస్ నిరోధక టీకాలు వేయాలని నిర్ణయించామని తెలిపారు.

తిరుచెందూర్ ఆలయ హుండీ ఆదాయం రూ.2.48 కోట్లు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

పెరంబూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ సుబ్రహ్మణ్య స్వామి వారి హుండీ ఆదాయం రూ.2.48 కోట్లు వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన తిరుచెందూర్ మురుగన్ ఆలయానికి పలు జిల్లాలు, పొరుగు రాష్ట్రాలు, విదేశాల నుంచి భక్తులు వస్తుంటారు. ఆలయాన్ని సందర్శించే భక్తులు స్వామివారికి కానుకలు సమర్పిస్తుంటారు. ఆ ప్రకారం, 12 రోజుల ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు బుధవారం ఆలయ ప్రాంగణంలోని మండపంలో జరిగింది. రూ.2.48 కోట్ల నగదు, 1,102 గ్రాముల బంగారం, 14 కిలోల వెండి భక్తులు కానుక సమర్పించారని ఆలయ అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఎంలో అంతర్జాతీయ సదస్సు



అడయార్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళనిలోని 'ఎస్‌ఆర్‌ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ'లో గురువారం 'కండెన్స్ మ్యాటర్ ఫిజిక్స్ అండ్ నానో టెక్నాలజీ' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రామచంద్రన్ స్వాగతోపన్యాసంతో ప్రారంభమైన ఈ సదస్సులో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీవీ గోమతి, డీన్ డాక్టర్ సీవీ జయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.పొన్నుస్వామి ప్రత్యేక ఉపన్యాసాలు చేశారు. అనంతరం ఇన్‌స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ హరిణి శాస్త్రి శాస్త్రీయ చరిత్ర పరిణామం తదితర అంశాలపై సెషన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సంగ్ ఊక్ కిమ్ ప్రసంగంలో ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంలో నానో టెక్నాలజీ పాత్ర హైలెట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఆర్‌ఎంకు దక్షిణ కొరియాలోని అడ్వాన్స్‌డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మధ్య అవగాహనా ఒప్పందం జరిగింది.

సదస్సులో విద్యావేత్తలు, ఎస్‌ఆర్‌ఎం ప్రతినిధులు

దేవనాథ స్వామి ఆలయంలో ఒకేరోజు 130 వివాహాలు


వధూవరులు, బంధువులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

చెన్నై, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడలూరు సమీపం తిరువందిపురం దేవనాథ స్వామి ఆలయంలో ఒకే రోజు 130 వివాహాలు జరిగాయి. నూతన వధూవరులు, బంధువులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడిది. దేవనాథ స్వామి ఆలయంలో వివాహం చేసుకుంటే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. శుభ ముహూర్తపు రోజుల్లో ఆలయంలో వంద నుంచి 300 వివాహాల వరకు జరుగుతుంటాయి. ఆ ప్రకారం, గురువారం ఆవని మాసం శుభ ముహూర్తం కావడంతో తెల్లవారుజామున 4 గంటల నుంచే వివాహాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో 105, చుట్టుపక్కల కల్యాణ మండపాల్లో 25 వివాహాలు జరిగాయి. వివాహం చేసుకున్న వధూవరులు స్వామివారిని దర్శించుకున్నారు. వధూవరులు, బంధువులతో ఆలయ ప్రాంగణం, తిరువందిపురం పట్టణం కళకళలాడింది. వివాహాలకు వచ్చిన వారి వాహనాలతో నగరలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. తెల్లవారుజాము నుంచే విధులు చేపట్టిన ట్రాఫిక్ పోలీసులు, ట్రాఫిక్ రద్దీ నియంత్రించి వాహనాలను పంపించారు.

'శ్రీహర్'లో నేత్రదానంపై ప్రచారం



అవగాహనా కార్యక్రమంలో విద్యార్థులు, వైద్యులు

అడయార్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (శ్రీహర్) ప్రాంగణంలో గురువారం నేత్రదానంపై వాక్‌థాన్ జరిగింది. ఇందులో 500 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేత్ర వైద్య విభాగాధిపతి డాక్టర్ సమరపురి మాట్లాడుతూ.. నేత వైద్యంలో ఇటీవలి పురోగతితో, ఒకే దాత నుంచి వచ్చే కార్నియాలు నలుగురి దృష్టిని పునరుద్ధరించగలవని తెలిపారు. నేత్రదానం కోసం ప్రతిజ్ఞ చేయడం కంటే వ్యక్తులు తమ కుటుంబ సభ్యులకు తెలియజేయడం చాలా కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య కళాశాల డీన్ డాక్టర్ కె.బాలాజీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరూర్ కన్యకా పరమేశ్వరి ఆలయ మహా కుంభాభిషేకం


కుంభాభిషేక మహోత్సవంలో అధ్యక్షులు త్రినాథ్ కుమార్, ఆలయ నిర్వాహకులు

ప్యారీస్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన సెవ్వాపేట సమీపంలోని తిరూర్ ప్రాంతంలో ఉన్న కన్యకా పరమేశ్వరి ఆలయ మహాకుంభాభిషేకం గురువారం వైభవంగా జరిగింది. తమిళనాడు ఆర్యవైశ్య మహాసభ గ్రేటర్ చెన్నై చైర్మన్ కెకె.త్రినాథ్‌కుమార్, ఆలయ నిర్వాహకుల పర్యవేక్షణలో సాగిన ఈ వైభవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని సేవించుకున్నారు. ఈ సందర్భంగా కెకె.త్రినాథ్‌కుమార్ మాట్లాడుతూ, 1981లో శంకుస్థాపన చేసిన తిరూర్ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ అమ్మవారికి మాత్రమే ఇన్నాళ్లు పూజలు జరిగాయన్నారు. దాతల సాయంతో ఆలయ జీర్ణోద్ధరణ పనులు పూర్తిచేసి, ప్రస్తుతం ఈ ఆలయ ప్రాంగణంలో నూతనంగా సత్యనారాయణస్వామి, దుర్గాదేవి, కాలభైరవుడు, వినాయకుడు, నవగ్రహాలు, పరివార దేవతలు, అయ్యప్ప, పరమశివుడు, బాలాజీ, మురుగన్, దేశంలోనే మొట్టమొదటి సారిగా నవపాశానంతో కళాత్మకంగా రూపొందించిన ఆనంద కృష్ణుడి సన్నిధి సహా అన్ని సన్నిధులకు కుంభాభిషేకం నిర్వహించడం అమ్మవారు కల్పించిన భాగ్యమన్నారు. నిత్య పూజలకు అనువుగా ఆలయంలో భక్తులకు మెరుగైన వసతులు కల్పించినట్లు ఆయన తెలిపారు. గురువారం ఉదయం పుణ్యనదీ జలాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి మహాకుంభాభిషేకం నిర్వహించి విచ్చేసిన భక్తులపై సంప్రోక్షించారు.